ప్రజాశక్తి
మంగళవారం 4 జనవరి, 2025 5
శ్రీకాకుళం

సూక్ష్మ బంగారు రథసప్తమి

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గకు చెందిన ప్రముఖ సూక్ష్మ కళాకారులు కొత్తపల్లి రమేష్ చారి సూక్ష్మ రథసప్తమి లోగోని తయారు చేశారు. దీని తయారీకి వంద మిల్లీగ్రాముల బంగారాన్ని ఉపయోగించారు. దీని ఎత్తు ఒక సెంటీమీటరు వెడల్పు, సెంటీమీటర్ పరిమాణంలో తయారు చేసినట్లు తెలిపారు. దీన్ని తయారు చేయడానికి రెండు గంటల సమయం పట్టిందన్నారు.

నేడే అసలు ఘట్టం

- రెండు రోజులుగా ఆకట్టుకున్న రథసప్తమి ఉత్సవాలు
- ప్రారంభమైన ఆదిత్యుని జయంతి వేడుకలు
- అధిక సంఖ్యలో తరలిరానున్న సందర్శకులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

రథసప్తమి ఉత్సవాలను ప్రభుత్వం రాష్ట్ర పండగగా గుర్తించిన నేపథ్యంలో... రెండు రోజులుగా సూర్య నమస్కారాలు, శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలు, సందర్శకులను అలరించాయి. అసలు ఘట్టం మంగళవారం మొదలు కానుంది. అర్ధరాత్రి 12 గంటల తర్వాత క్షీరాభిషేక సేవలతో వేడుకులు ప్రారంభమయ్యాయి. క్షీరాభిషేకానికి జనం రద్దీ అంతగా లేకపోయినా ఉదయం ఏడు గంటల ద్వారా యాత్రికుల తాకిడి మొదలు కానుంది. ఆదిత్యుని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలు ఒడిశా, తెలంగాణ నుంచి వేలాది మంది యాత్రికులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసింది. పలు రకాల స్వచ్ఛంద సంస్థలు సందర్శకులకు మజ్జిగ, మంచినీళ్లు, పులిహోరా, అన్నదానం చేపట్టేందుకు సిద్ధమయ్యాయి.

- ప్రజాశక్తి, శ్రీకాకుళం ప్రతినిధి

పావనమూర్తికి పాలాభిషేకం

వెలుగులరేడు సూర్య నారాయణస్వామి రథసప్తమి (జయంత్యుత్సవం) వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి రాత్రి 12.10 గంటలకు సుప్రభాత సేవ, ఉష:కాలార్చనతో వేడుకలు మొదలయ్యాయి. 12.30 గంటల నుంచి క్షీరాభిషేక సేవ మొదలైంది. క్షీరాభిషేకాన్ని చూసేందుకు రాత్రి పది గంటల నుంచే ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లలో సందర్శకులు యాత్రికులు బారులు తీరారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి వి.వినయ్‌చంద్ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారతో తయారు చేసిన పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో మూలవిరాట్టుకు క్షీరాభిషేకం చేశారు. ఉదయం ఆరు గంటలకు నిజరూప దర్శనం ప్రారంభం కానుంది.

సామాన్య యాత్రికులకు అవస్థలు తప్పేనా?

గతేడాది మాదిరిగానే ఈ ఏడాదీ టైమ్ స్లాట్ విధానాన్ని అమలు చేస్తున్నారు. గతేడాది టైమ్ స్లాట్ విధానంపై అటు యాత్రికులు, ఇటు పోలీసులకు అవగాహన కల్పించడంలో దేవదాయశాఖ విఫలం కావడంతో అందరూ ఒకేసారి దర్శనానికి రావడంతో క్యూలైన్లు కిక్కిసిరిపోయాయి. ఉచిత దర్శనం క్యూలైన్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. అధిక శాతం మంది యాత్రికులు అందులోనే భారీగా బారులు తీరడం ప్రతి ఏడాదీ తటస్థిస్తోంది. వేడుకలకు నియమించిన ఇతర ఆలయాల ఇఒలు అనివెట్టి మండపంలోనే ఉండిపోవడంతో, వారి ఇబ్బందులను పట్టించుకునే పరిస్థితి ఉండడం లేదు. ఉచిత దర్శనం మార్గంలో ఒక కంపార్ట్‌మెంట్ నుంచి మరో కంపార్ట్‌మెంట్‌లోకి సందర్శకులను విడిచిపెడుతున్న సందర్భంలో తోపులాటలు చోటుచేసుకుంటున్నాయి. క్యూలైన్‌లో ఉన్న సందర్శకులకు తాగునీటి సౌకర్యంపైనా దృష్టిసారించాల్సి ఉంది.

వివిఐపి క్యూలైన్‌లో లైవ్ కెమెరాలు

పోలీసులు, పలు ప్రభుత్వశాఖలకు చెందిన సిబ్బంది తమ కుటుంబ సభ్యులను దగ్గరుండి దర్శనం చేయిస్తున్నారనే విమర్శలకు పోలీసుశాఖ చెక్ పెడుతోంది. వివిఐపిల ప్రవేశ ద్వారం వద్ద లైవ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని ఉన్నతాధికారులు కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షించనున్నారు.

బందోబస్తు విధులపై ఎస్‌పి దిశానిర్దేశం

రథసప్తమి వేడుకలకు వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులను ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి దిశా నిర్దేశం చేశారు. సోమవారం అరసవల్లిలో రథసప్తమి వేడుకలకు బందోబస్తు విధులు నిర్వహించడానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు నిలిపేందుకు నిర్ణయించిన నిర్దేశ ప్రదేశాల్లో పార్కింగ్ చేసేలా చూడాలని సూచించారు. ముగ్గురు అదనపు ఎస్‌పిల పర్యవేక్షణలో, డిఎస్‌పిలతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది మొత్తం సుమారు 2,300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. యాత్రికుల కోసం ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిబ్బంది ఎవరికి నియమించిన స్థానంలో వారు విధులు నిర్వర్తించాలన్నారు. సందర్శకులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి ఎటువంటి తోపులాట్లు, అవాంతరాలు జరగకుండా విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ఆలయ ప్రాంగణ పరిసర ప్రాంతాలు, దర్శన మార్గాలు, క్యూలైన్లను పరిశీలించారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, జెసి

అత్యవసర వైద్య పరిస్థితులపై మాక్ డ్రిల్

వేడుకలకు వచ్చే యాత్రికులు అపస్మారకస్థితి, అస్వస్థతకు గురైనప్పుడు క్యూలైన్‌లో నుంచి బయటకు తీసుకురావడం, అత్యవసర చికిత్స, హృదయ శ్వాసకోశ పునర్జీవనం చేయడం, స్ట్రక్చర్‌పై అంబులెన్స్‌లో ఎక్కించడం తదితర అత్యవసర చికిత్స అంశానికి సంబంధించి పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాడి రైతులు

పాడి రైతులకు అన్యాయం

- పాల సేకరణ ధరను పెంచాలి
- కలెక్టరేట్ వద్ద పాడి రైతుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రాల్లో పాలను పూర్తిగా తీసుకోకుండా, పది శాతం అర్థాంతరంగా వెనక్కి పంపిస్తున్నారని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పొందూరు చంద్రరావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు, బగాది వాసు తెలిపారు. డెయిరీ వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని పాల రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలని తదితర డిమాండ్లతో రైతు సంఘాల ఆధ్వర్యాన పాడి రైతులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలు లీటరుకు రూ.నాలుగు వరకు తగ్గించిందని తెలిపారు. దీన్ని వ్యతిరేకిస్తూ డెయిరీలో అవినీతిని ప్రశ్నిస్తూ పాల రైతుల డెయిరీ వద్ద ఆందోళన చేపట్టిన తర్వాత ప్రభుత్వం శాసనసభ హౌస్ కమిటీ వేసి విచారణ చేసిందని చెప్పారు. విచారణ కొనసాగుతున్న తరుణంలో యాజమాన్యం పాల సేకరణ కేంద్రాలకు రైతులు సరఫరా చేస్తున్న ఆవు పాలలో పది శాతం వెనక్కి పంపిస్తోందన్నారు. బ్యాంకుల ద్వారా, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి రైతులు పెట్టుబడి పెట్టి పాడి పశువుల పోషణ సాగిస్తున్నారని తెలిపారు. వాటికి అవసరమైన దాణా, మందులు, ఇతర ముడి సరకుల ధరలు పెరిగి పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పాలు ఇస్తున్న రైతులకు గిట్టుబాటు ధర చెల్లించకపోగా, పాలు మిగులు చూపించి వెనక్కి పంపిస్తున్నారని విమర్శించారు. విశాఖ డెయిరీని కంపెనీ చట్టం నుంచి మినహాయించి సహకార రంగంలో మార్చాలని డిమాండ్ చేశారు. ఆవు పాల సేకరణపై పరిమితి ఎత్తివేయాలని కోరారు. పాల సేకరణ ధరను పెంచాలన్నారు. ఏడాదికి పాల ఉత్పత్తిదారులకు మూడుసార్లు బోనస్ ఇవ్వాలని, 50 శాతం రాయితీపై దాణాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లీటరుకు రూ.ఐదు ఇవ్వాలని, ఏటా సంక్రాంతికి ఇచ్చే బోనస్‌ను వెంటనే చెల్లించాలన్నారు. లేకుంటే పాడి రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో పాడి రైతులు అంబటి రమణ, పి.రామకృష్ణ, ఎల్.కృష్ణమూర్తి, ఎల్.రావణ, కె.సింహాచలం, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉత్కంఠగా సాగుతున్న వాలీబాల్ పోటీ

పోటీలను తిలకిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాష్ట్రస్థాయి వాలీబాల్ విజేత విజయనగరం

- ద్వితీయ, తృతీయ స్థానాల్లో శ్రీకాకుళం, కృష్ణా జట్లు
- తిలకించిన జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రథసప్తమి వేడుకల్లో భాగంగా నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఆదివారం ప్రారంభమైన ఈ పోటీల్లో తొలి రోజుల ఆరు జిల్లాల జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 జట్లు పాల్గొన్నాయి. వాటిలో గుంటూరు, కడప, చిత్తూరు, నెల్లూరు, తూర్పు గోదావరి, విజయనగరం, కృష్ణా, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనంతపురం జిల్లాల నుంచి ఒక్కో జట్టు పాల్గొన్నాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి రెండు జట్లు పాల్గొన్నాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్ పోటీలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల జట్లు తలపడ్డాయి. క్రీడాకారులు నువ్వా, నేనా అన్న రీతిలో పోటీపడ్డారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. వారికి రూ.50 వేలు నగదు బహుమతి ప్రకటించారు. రన్నర్‌గా శ్రీకాకుళం టీం రెండో స్థానంలో నిలిచి రూ.30 వేలు నగదు బహుమతి దక్కించుకున్నారు. వీరితో పాటు తృతీయ స్థానంలో నిలిచిన కృష్ణ జిల్లా జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతి లభించింది. ఫైనల్ మ్యాచ్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్‌డిఓ కృష్ణమూర్తి పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిఎస్‌డిఓ శ్రీధర్, కార్యదర్శి పి.సుందరరావు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర పంక్వాల్

ప్రజాశక్తి - పలాస

రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఈస్ట్‌కోస్ట్ రైల్వే భువనేశ్వర్ జనరల్ మేనేజర్ పరమేశ్వర పంక్వాల్ సోమవారం సందర్శించారు. ఖుర్దా రోడ్ నుంచి ప్రత్యేక రైలులో పలాస చేరుకున్న ఆయన రెండు గంటల పాటు రైల్వేస్టేషన్, రైల్వే కాలనీ, డ్రైవర్లు, గార్డుల రన్నింగ్ రూమ్, ఆర్‌పిఎఫ్ బ్యారక్స్‌ను పరిశీలించారు. రైల్వే కాలనీలో సిబ్బంది గృహాలు, కాలువలు పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది క్వార్టర్‌కు నిధులు ఇస్తున్నా ఎందుకు పనులు అసంపూర్తిగా ఉన్నాయని అధికారులను ప్రశ్నించారు. కాలువల నిర్వహణ బాగాలేదని, దీన్ని సరిచేయాల్సి ఉందన్నారు. సిగ్నలింగ్ కార్యాలయం వద్దకు వెళ్లి ప్రత్యేక కంప్యూటర్ మ్యాప్ ద్వారా ట్రాక్ పరిస్థితిని గమనించారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి రైల్వే ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రన్నింగ్ రూమ్, రహదారుల నిర్వహణ బాగుందని సంబంధిత అధికారులకు రివార్డును ప్రకటించారు. కార్యక్రమంలో డిఆర్‌ఎం హెచ్.ఎస్ బజ్వా, సీనియర్ డి.ఎం అభిషేక్ కుమార్, ఎడిఆర్‌ఎం టి.కె బెహరా, సిఒఎం వై.ఎస్ బాబు, డిఒఎం సునీల్ కుమార్, డిసిఎం అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే భువనేశ్వర జనరల్ మేనేజర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వే క్వార్టర్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎల్‌సి గేటు వద్ద అండర్ పాస్ వే నిర్మాణానికి అవసరమైన సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పాస్ వేకి అవకాశం లేకపోతే ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కుర్దా డివిజనల్ రైల్వే అధికార్లు, ప్రకాశరావు పట్నాయక్, ప్రేమ్‌కుమార్, సెల్లా దేవరాజు, మంగి లక్ష్మీరెడ్డి, స్టేషన్ అధికార్లు పాల్గొన్నారు.

అధికారులతో కలిసి పర్యటిస్తున్న రైల్వే జిఎం పరమేశ్వర పంక్వాల్

నిరసన తెలుపుతున్న ప్రజలు

అండర్ పాస్ వే నిర్మించాలి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నుంచి కొలిగాం వెళ్లే మార్గంలో రైల్వే అండర్ పాస్ వే నిర్మించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు కోరారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వాల్ పర్యటన నేపథ్యంలో పుర ప్రముఖులు, విద్యార్థులు రైల్వే జిఎం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రైల్వే అండర్ పాస్ వే నిర్మించాలని కొన్నాళ్లుగా వినతిపత్రాలు అందజేసినా, రైల్వే అధికార యంత్రాంగం స్పందించడం లేదన్నారు. ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వాహనదారులు, విద్యార్థులు, ఇచ్ఛాపురం పరిసర గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రతి 20 నిమిషాలకూ గేటు పడడంతో అత్యవసర సమయాల్లో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైల్వే అండర్ పాస్ నిర్మించాలని కోరారు. ఎల్‌సి గేటు వద్ద అండర్ పాస్ వే నిర్మాణానికి అవసరమైన సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని రైల్వే జిఎం స్పష్టం చేశారు. పాస్ వేకి అవకాశం లేకపోతే ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆటో, కారు, మ్యాజిక్ యూనియన్ నాయకులు, స్వర్ణభారత్, ఆదిత్య కళాశాలల, సత్యసాయి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను రైల్వే జిఎం పరిశీలించారు. రైల్వే క్వార్టర్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఖుర్దా డివిజనల్ రైల్వే అధికారులు ప్రకాశరావు పట్నాయక్, ప్రేమ్‌కుమార్, సెల్లా దేవరాజు, మంగి లక్ష్మి రెడ్డి, స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో తుపాను భవనాలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని తుపాను భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 35 ఏళ్ల క్రితం అప్పటి కేంద్ర ప్రభుత్వం తీర ప్రాంత గ్రామాల్లో తుపాను రక్షిత భావనలు నిర్మించారు. 15 ఏళ్ల క్రితం కొన్ని భవనాలకు మరమ్మతులు చేపట్టారు. వాటిని వినియోగంలో తేవడంలో అధికారులు విఫలమయ్యారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఏటా అక్టోబరు, నంబరు నెలల్లో తుపాను వస్తూ ఉంటాయి. తుపాన్లు వస్తే తీర ప్రాంత ప్రజలకు రక్షణ కరువయ్యే చెప్పాలి. గతంలో తుపాన్లు వచ్చే సమయంలో అధికారులు తీర ప్రాంత ప్రజలను తుపాను రక్షిత భవనాలకు వాహనాల ద్వారా తరలించి వారిని రక్షణ కల్పించే వారు. తుపాన్లు తీవ్రత తగ్గుముఖం పట్టే వరకూ ఈ భవనాల్లోనే ఉంచి భోజన వసతులు, పునరావాసం కల్పించే వారు.

గతంలో తీర ప్రాంత గ్రామాల్లో తుపాను రక్షిత భవనాలు ఉండడంతో ఎంత తీవ్ర తుపాను వచ్చినా ఆ భవనాలు ఉన్నాయని భరోసా ఉండేది. కానీ, ఇప్పుడు తుపాన్లు వస్తే ఆ పరిస్థితి కనిపించడం లేదు. మండలంలోని మరువాడ, జగన్నాథపురం, కె.లింగూడు, ఎం.సున్నాపల్లి, సంధిపేట, గెద్దలపాడు, పాతమేఘవరం గ్రామాల్లో పూర్తిగా తొలగించడంతో తుపాను రక్షిత భవనాలు ఆనవాలు కనుమరుగయ్యాయి. సూరాడ వానిపేట, పెట్టవానిపేట, బావనపాడు, ఉమిలాడ, మలగాం గ్రామాల్లో భవనాల పూర్తిగా శిథిలావస్థ చేరుకున్నాయి. ఆర్.సున్నాపల్లి, మేఘవరం, రుంకు, కొల్లిపాడు గ్రామాల్లో మాత్రమే కొత్త భవనాలు నిర్మించారు. వచ్చే వర్షాకాలానికి నూతన భవనాలు నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు. అలాగే రక్షిత భావనలు తొలగించిన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి తీర ప్రాంతాల్లోని రక్షిత భవనాలు స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న తుపాను భవనం

దావా సమాను

మహారాజు శ్రీ సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కోర్టు, టెక్కలి

I.P. No: 3/2024

బిట్వీన్:
శ్రీ పిట్ట మల్లేసు .....పిటిషనర్
మరియు:
కుంచాల గోవిందరావు వగైరాలు .....రెస్పాండెంట్స్

R-19. చిన్నాల అప్పారావు, S/o శిమ్మయ్య, వయస్సు 50 సం॥, కేలవలస గ్రామం. సారవకోట మండలం, శ్రీకాకుళం జిల్లా

ఈ దావాలో నీపైన IP.No: 3/2024 దావా వేసి ఉండుటవలన నీవు స్వతహాగా గాని సంపూర్ణంగా సంజాయిషీ పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తరములు చెప్పుగూడిన కూడా వచ్చే ఏదో ఒక మనిషి ద్వారా గాని సదరు దావాకు ప్రత్యుత్తరములు చెప్పగలందులకు **తేది 07-02-2025న ఉ॥ 10.30 గంటలకు** ఈ కోర్టులో హాజరై మీరు మా వాదనలు వినిపించి కోవలసిందిగా కోరడమైనది. పై చెప్పుకోబడిన దినము నందు నీవు హాజరు కాకుండా తప్పిన యెడల నీ పరోక్షమునందు అవ్యాజ్యం విమర్శ చేసి తీర్మాణించడం అగునని మీరు తెలుసుకోవలసింది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

లఖినేని శ్రీనివాసులు
న్యాయవాది,
కోటబొమ్మాళి, సెల్: 9676549303.

IN THE COURT OF THE MVACT CUM X ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
M.V.O.P.No. 2269 OF 2023

Between:
Gaffar Ali ... Petitioner
A N D
Alivelu Mangatayaru Hanumara and Others ...Respondents

To,
D. Sampathi Rao, S/o. Chandrasekhar Rao, Aged: Major, Occ: Driver, R/o. 7-10, Peddaveedhi, Pedda Mellapudi, Mallaputti, Srikakulam Dist-532215.

Please take notice that the above petitioner had filed the case for grant of compensation for the injuries sustained by name Gaffar Ali, in a motor vehicle accident which occurred on 03-09-2023 under the limits of **P.S. Saifabad.**

The above case is posted to **04-03-2025 at 10.30 AM** for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an Advocate, else the case will be decided exparte.

[BY ORDER OF THE COURT]
Sd/- **K. ANAND REDDY,**
D. VENKAT RAMANA, Advocates
COUNSELS FOR THE PETITIONERS
Off: Flat No. 212, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyderabad-500036.
Cell: 9848052455, 9848051707

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుధాకర్

సమర్ధులకే ఉద్యోగాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఏ కంపెనీ అయినా సమర్ధులకే ఉద్యోగాలు ఇస్తుందని, అందుకు ప్రతిఒక్కరూ వ్యక్తి నైపుణ్యతలను పెంపొందించుకోవాలని హైదరబాద్‌కు చెందిన కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) చైర్మన్ సిహెచ్.సుధాకర్ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యాన సోమవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి టెక్నో విజన్ సదస్సు ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ మేదస్సుకు సాంకేతికత తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. గౌరవ అతిథి, సిఎస్ఐ కార్యదర్శి డాక్టర్ డి.వి.రమణ మాట్లాడుతూ సాంకేతికత వైపు ప్రపంచం పరుగులు తీస్తుందన్నారు. ప్రతిఒక్కరూ నాయకత్వ లక్షణాలను, ఎంటర్ పెన్యూర్ షిప్, నూతన ఆవిష్కరణలకు అవసరమని అన్నారు. ఇటు వంటి సదస్సులు యువకుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీచేందుకు దోహదపడతాయన్నారు. ఇటు వంటి వేదికలను యువకులు సువర్ణ అవకాశంగా భావించి వినియోగించుకోవాలన్నారు. ప్రతి కళాశాలా కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ బి.వి.రమణ, కన్వీనర్, సిఎస్‌హెచ్‌డి డాక్టర్ వై.రమేష్ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి

శ్రీకాకుళం అర్బన్: లక్ష్య సాధన కోసం నిర్విరామ కృషి ఎంతో అవసరమని, క్రీడాకారుల్లో రాణించడానికి వీలుంటుందని రంజీ క్రికెటర్ ఎస్‌హెచ్ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. నగరంలోని ఇల్లిసుపురంలో స్కూల్ ఆఫ్ చెస్ అకాడమిని ఆయన సోమవారం సందర్శించారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి చిల్డ్రన్స్ చెస్ టోర్నీలో ఆయన పాల్గొని విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన చెస్ క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులను అందజేసి మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధస్సును పెంచుతుందన్నారు. చిన్న తనంలోనే చెస్ ఆడడం నేర్చుకోవడం వల్ల మేధస్సుతో పాటు మానసిక స్థితి ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. పోటీల్లో రాణిస్తున్న చిన్నారులను ఆయన అభినందించారు.

పంచాయతీ కార్యాలయం రోడ్డులో ఉన్న టిడిపి ఫ్లెక్సీలు

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయినా మండల అధికారులకు మాత్రం చీమకుట్టినట్లైనలేదని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో ఎక్కడ చూసినా వివిధ రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు దర్శినమిస్తున్నాయి. ముఖ్యంగా కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ కార్యాలయానికి, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, లఖందిడ్డి, యలమంచిలి, గ్రామాలకు వెళ్లే రోడ్లలో టిడిపి, జనసేన, వైసిపి నాయకులు ఫ్లెక్సీలు దర్శనం ఇస్తున్నాయి. ఈ రహదారి గుండా రోజూ అధికారులు వెళ్తున్నా... కనీసం పట్టించుకోవడం లేదని పలువురు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని కోరుతున్నారు.

ఉద్యోగాలపై దృష్టి సారించాలి

పలాస: విద్యార్థులు ఒక వైపు చదువుతూ మరోవైపు ఉద్యోగాలపై దృష్టి సారించాలని పలాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మి అన్నారు. డిగ్రీ కళాశాలలో సోమవారం బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (బిసిడిఇ) ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం ప్రేరణ మిత్రపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థల ఉద్యోగులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అవకాశాలు వచ్చే సమయంలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షునిగా నరేష్

నరేష్

సంతబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గ వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షునిగా నక్కిట్ల నరేష్ నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు ఆయనకు అందినట్లు తెలిపారు. తనకు నియోజవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షునిగా నియమించినందుకు పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి, టెక్కలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పేరాడ తిలక్‌కు, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌కు అభినందనలు తెలిపారు. టెక్కలి నియోజకవర్గం అధ్యక్షునిగా నియమించినందుకు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కెళ్లి జగన్నాయకులు, పాలతలగాం ఎంపిటిసి అట్టాడ అప్పలనాయుడు, నరసాపురం సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి, కె.లింగుడు, సర్పంచ్ నారాయణలు హర్షం వ్యక్తం చేశారు.

రైల్వే జిఎంకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి- పలాస

రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫంక్వాల్ సోమవారం పలాస, ఇచ్ఛాపురం రైల్వే స్టేసన్లను సందర్శించారు. ఈ సందర్భంగా వినతులు వెల్లువెత్తాయి.కాశీబుగ్గ రైల్వే వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. హౌరా, చెన్నయ్, విశాఖ ఎక్స్‌ప్రెస్, బరంపురం, విశాఖపట్నం రైలులను మందస రోడ్డు, పూండి రైల్వే స్టేషన్లలో నిలుపుదల చేయాలన్నారు. ఆమెతో పాటు ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: రైలు నిలయంలోని సమస్యలను పరిష్కరించాలని జనసేన, జెడ్‌ఆర్‌యుసిసి సభ్యులు, పుర ప్రముఖులు, రైల్వే యూజర్ కమిటీ సభ్యులు రైల్వే జిఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా రెండు ప్రాంతాల్లో జగనన్న కాలనీ, రత్తకన్న ఎల్‌సి గేట్ వద్ద అండర్ పాస్ వే నిర్మించాలని జెడ్‌ఆర్‌యుసిసి సభ్యులు మోహనరావు విన్నవించారు. అలాగే ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ ఛైర్పర్సన్ రాజ్యలక్ష్మి, కూటమి నేతలు కాళ్ల ధర్మారావు, బుద్దాల నిర్మలారెడ్డి, సాయి కామేష్ అండర్ పాస్ వే ఆవశ్యకత గురించి వివరించారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు రైల్వే స్టేషన్ కావడంతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. బారువా, జాదిపూడి రైల్వే స్టేషన్లల్లో బరంపురం, విశాఖ పాసింజర్ రైలు, కటక్-గుణుపూర్ రైలు నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కుర్దా డివిజనల్ రైల్వే అధికారులు ప్రకాశరావు పట్నాయక్, ప్రేమ్‌కుమార్, సెల్లా దేవరాజు, మంగి లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

సోంపేట : సోంపేట మండలంలోని ఏకైక రైల్వే స్టేషన్ అయిన బారువ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లను నిలుపుదల చేయాలని యూజర్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాంబుడ్డి గణపతి, రత్నాల శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బారువలో విశాఖ - భువనేశ్వర్ ఇంటర్సిటీ, బరంపురం - విశాఖ ఇంటర్సిటీ, బరంపురం - విశాఖపట్నం, పూరి-గుణపూర్ పాసింజర్లను నిలుపుదల చేయాలని కోరారు. రైల్వే స్టేషన్లో డ్రెయినేజీ తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.గుణ్ణయ్య, బి.ఖగేశ్వరరావు, ఎం.శంకరరావు, సిహెచ్.ధర్మారావు, ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు, రాజ్యలక్ష్మి

కంచిలి : మండలంలోని అంపురం కూడలి వద్ద ఉన్న రైల్వే గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని టిడిపి నాయకులు మాదిన ప్రదీప్ రైల్వే జిఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రైల్వే గేట్ మీదుగా ఎం.ఎస్.పల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగులు రాకపోకలు సాగిస్తున్నారని అన్నారు. అలాగే కంచిలి రైల్వే స్టేషన్‌లో పూరి అహ్మదాబాద్, హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మణికంఠ, కె.కె.పాడి పాల్గొన్నారు.

సమిష్టిగా పనిచేయాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నియోజకవర్గంలో కార్యకర్తలంతా సమిష్టిగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌టిఆర్ భవనంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేసిన నిధులతో డ్రెయినేజీలు, లింకు రోడ్లు, సిసి రోడ్లు, పాఠశాలల ప్రహారీలను నిర్మించుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నా నెరవేర్చేందుకు కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే కొన్ని పథకాలు అమలు చేశామని, మిగిలినవి త్వరలో అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈయనతో పాటు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, చౌదరి బాబ్జి, బోయిన గోవిందరాజులు ఉన్నారు.

నేడు క్రీడల ముగింపు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ముగింపు క్రీడలు నిర్వహించనున్నామని కన్వీనర్ బాడాన నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల చాకిపల్లిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఉదయం 9 గంటలకు మైదానానికి హాజరుకావాలని కోరారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల పరిధిలోని అన్ని పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హాజరుకావాలన్నారు.

5న ఫీజు పోరు

కోటబొమ్మాళి: మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు టెక్కలి నియోజకవర్గ సమన్వకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యాన ఈ నెల 5న కలెక్టరేట్ వద్ద ఫీజు పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వైసిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు చెల్లింకపోవడంతో కళాశాల యాజమాన్యం ఒత్తిడి పెట్టి ఫీజులు కట్టాలని గట్టిగా చెబుతున్నారని అన్నారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రలు ఇబ్బందులు పడుతున్నారని అన్నార. ప్రభుత్వం ఫీజు చెల్లించే వరకు ఉద్యమం చేస్తామన్నారు.

కాలువ మరమ్మతులకు నిధులు

పలాస : వంశధార ఎడమ కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు ఒక ప్రకటనలో కోరారు. ఈ సాగునీటి కాలువలు గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. దీంతో సాగునీరు పొలాలకు సక్రమంగా అందడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికతీతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయిందన్నారు. త్వరిగతిన ఈ పనులు చేపట్టి సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

'తెప్పల'కు పురస్కారం

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళం శాంతినికేతన్ కళాశాలలో సోమవారం తెలుగు రచయితల వేదిక నెలవారీ కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలాసకు చెందిన రచయిత, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి పాల్గొన్నారు. సర్వకర్మ సాక్షి సూర్య భగవానుడు అను కవితా గానం చేసి ప్రశంసలు పొందారు. శతమాస సాహితీ సమ్మేళనం హంస వాహిని పుస్తకావిష్కరణ సందర్భాన్ని పురస్కరించుకుని దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తెరవే అధ్యక్షులు యు.నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

కనువిందు చేసిన సాంస్కృతిక వేడుక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రథసప్తమి వేడుకల్లో భాగంగా రెండో రోజైన సోమవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సినీ నేపథ్య గాయని మంగ్లీ బృందం సినీ ఆర్కెస్ట్రా ఆద్యంతం ఆకట్టుకుంది. మరోవైపు లేజర్ షో అందరినీ కనువిందు చేసింది. సాయంత్రం 5.30 గంటల నుంచి మొదలైన సాంస్కృతిక వేడుకల్లో తొలుత సుందరంపల్లి సోక్సోఫోన్, సీతంపేట ఐటిడిఎ నుంచి దింసా, జానపద నృత్యాలు అలరించాయి. గిరిజన సంస్కృతికి అద్దం పట్టే ఈ వేడుక అద్యంతం నగర వాసులను మంత్ర ముగ్ధులను చేసింది. శాస్త్రీయ సంగీత కచేరీ మూవుడూరు సత్యనారాయణ, నీరజా సుబ్రహ్మణ్యం, రఘుపాత్రుని శ్రీకాంత్ బృందాలు శాస్త్రీయ నృత్య రూపకాలు ప్రదర్శించారు. సాంస్కృతిక వేడుకల ముగింపు సందర్భంగా క్రాకర్స్‌షో నిర్వహించారు.

మాట్లాడుతున్న సతీష్

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

విద్యార్థులకు నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ సతీష్ మాకేన అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల 'ఉత్సవ్ ' పేరిట నిర్వహించిన వార్షికోత్సవం సోమవారం సందడిగా సాగింది. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నైపుణ్యాలు సాధించడంలో యువత వెనుకబడి ఉందని అన్నారు. డిగ్రీతో పాటు పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. సాంకేతికంగా ప్రపంచం మారుతోందని, రేపటి రోజుల్లో విప్లవాత్మకమైన మార్పులు రాబోతున్నాయని అన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం యువత పాటుపడాలని కోరారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు గమనించి ఆధునిక ప్రపంచానికి అవసరమైన కోర్సులు పూర్తి చేయాలని కోరారు. ఏ డిగ్రీ చదువుతున్నా... ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి కోర్సులు ఆన్‌లైన్‌లో చదివి వాటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, యూట్యూబ్ సింగర్ లావేటి మహేష్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకుగా సాగాయి.

మురుగునీటి సమస్యను పరిష్కరిస్తా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పెద్దమురహరిపురం సర్పంచ్, మాజీ ఎంపిపి గొరకల వసంత స్వామి తెలిపారు. మండలంలోని పూండి బస్టాండ్ పెద్దమురహరిపురం రోడ్‌లోని డ్రెయినేజీ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వందల మీటర్ల డ్రెయినేజీ మురుగు నీటితో నిండిపోవడంతో స్థానికులు ఇబ్బందిపడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే స్పందించి డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తను తొలిగించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. డ్రెయినేజీ ఎత్తు పెంచి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రూ.3 లక్షల పంచాయతీ నిధులతో డ్రెయినేజీ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో పంచాయతీ పరిధిలో రూ.1.57 కోట్లతో మూడు వేల మీటర్ల పొడవుతో పది సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీషకు గ్రామస్తుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు గొరకల గోపాల్, కీలు లోకనాథం, గర్ధం తిరుపతి, సైనీ వినోద్, కీలు మోహనరావు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ వసంతస్వామి

తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి

కాకినాడ జెఎన్‌టియు యూనివర్సిటీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న ఎన్‌టిఆర్ క్రీడా వికాస్ కేంద్రానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు కోచ్ నర్సిపురం శేఖర్ సోమవారం తెలిపారు. జిల్లా తరుపున పాల్గొన్న టెక్కలి క్రీడాకారులకు 8 స్వర్ణ, 6 వెండి, 7 రజత పతకాలు సాధించుకున్నారని అన్నారు. ఉత్తమ ఫైటర్‌గా తాస్వవి కృష్ణస్వామి, మెండ తపస్విలు నిలిచారన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లాను ఎంపిక చేసి రూ.పది వేలు నగదు, ట్రోఫీలను అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కోచ్ పామడవుల జగదీష్, రిఫరీగా నిలిచిన జశ్వంత్‌ని శేఖర్ అభినందించారు. టీమ్ మేనేజర్‌గా పడాల అక్క వ్యవహరించారని తెలిపారు.

పతకాలు సాధించుకున్న క్రీడాకారులు

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మాతల సమీపంలో రెండు బైక్‌లు ఢీకొని ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బలదకు చెందిన పొట్నూరు శ్రీకాంత్ ఆదివారం రాత్రి కొత్తూరులో సరుకులు కొనుగోలు చేసుకుని తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన పురటిగూడకు చెందిన బెహరా శంకర్ తన బైక్‌పై కొత్తూరు వస్తున్నారు. మాతల వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో కొత్తూరు సామాజిక ఆస్పత్రికి తరలించారు. బెహరా శంకర్‌కు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. హెచ్‌సి కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాందాసుపురంలో చోరీ

ప్రజాశక్తి- పొందూరు

చోరీ తీరును పరిశీలిస్తున్న ఎస్ఐ

మండలం కనిమెట్ట పంచాయితీ రాం దాసుపురంలో పైడి వెంకట సత్యవతి ఇంటిలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రతీరోజులాగే ఇంటికి తాళం వేసి ఇంటి స్లేడ్‌పై పెట్టి వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో బట్టలు చిందరవందరగా పడి ఉండడంతో నగదు, బంగారం పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ చోరీలో ఇంటిలో గల రూ.76 వేలు నగదు, తులంపావు బంగారం చోరీ చేసి ఎత్తుకుపోయినట్లు ఆమె పోలీసులకు తెలిపారు. ఈమె నిత్యం ఇంటికి తాళం వేసి అక్కడే పెట్టడం గమనించిన వ్యక్తులే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఎస్ఐ సత్యనారాయణ చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ధ్వంసమైన ఆటోను పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

కొట్లాట కేసులో పది మంది అరెస్టు

పొందూరు: మండలం కింతలి పంచాయితీ ఖాజీపేటలో ఆదివారం రెండు కుటుంబాల మధ్య జరిగిన కొట్లాట కేసుకు సంబంధించి సోమవారం పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. పాతకేసులను రాజీ చేసుకునే క్రమంలో ఘర్షణ నెలకొని కొట్లాటకు దారితీసిందన్నారు. దీనిపై ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక వర్గానికి చెందిన ఇద్దరిని, మరో వర్గానికి చెందిన ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఎటువంటి వివాదాలు, కొట్లాటలు జరగకుండా ముందుస్తుగా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

8న యోగా పోటీలు

పోలాకి: ఈ నెల 8న పోలాకి కేంద్రంలోని ప్రజా గ్రంథాలయంలో మండల స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు తాడి యర్రయ్య తెలిపారు. సోమవారం గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడారు. 8న తాడి దాలెమ్మ యర్రయ్య ఫౌండేషన్ ఆధ్వర్యాన గ్రంథాలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తునట్లు చెప్పారు. అదేరోజు గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేస్తామని అన్నారు. ఆసక్తి ఉన్న వారు 9346707343 సెల్ నంబరుకు ఈ నెల 7న సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశం రుసుం లేదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కేన్సర్ లోగో ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

కేన్సర్‌పై అవగాహన

సోంపేట : ప్రపంచం కేన్సర్ రహితగా మారాలని, అందుకు ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా మెలగాలని సంస్కార భారత విద్యార్థులు నినాదాలు చేశారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కళాశాల ఆవరణలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేన్సర్ లోగో ఆకారంలో విద్యార్థులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ దాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి వరకు హెలీకాప్టర్ రైడ్

శ్రీకాకుళం అర్బన్: రథసప్తమి వేడుకల్లో భాగంగా వినోదాన్ని అందిస్తున్న టూరిజం శాఖ హెలీకాప్టర్ రైడ్‌ను ఈనెల ఐదో తేదీ వరకు పొడిగిస్తున్నట్లు డ్వామా ప్రాజక్టు డైరక్టర్ సుధాకర్ తెలిపారు. ప్రజల్లో ఆదరణ పెరగడంతో వారి అభ్యర్థన మేరకు ఈ పొడిగింపు జరుగుతోందని, సోమవారం పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ రైడ్‌లో పాల్గొన్నారని వివరించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

రణస్థలం: మండలంలోని పాతార్లపల్లి సచివాలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం సౌజన్యతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, ఎంపిపి పిన్నింటి రజనీ సాయికుమార్, గ్రామ పెద్దలు పాతర్లపల్లి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 110 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 41 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, అప్తాలమిక్ ఆఫీసర్ చంద్రశేఖర్, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ సత్యవతి, క్యాంపు కో-ఆర్డినేటర్ సిహెచ్ అశ్విని కుమార్, నర్సింగ్ స్టాఫ్ గీతసాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో 13 పతకాలు

పలాస : తమిళనాడు రాష్ట్రం మధురైలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో పలాస క్రీడాకారులు పలు విభాగాల్లో 13 పతకాలను సాధించారు. తోసిని రాయ్, అయాన్, అన్విక, అంశక, రగవి, పార్ధసాయి, సుభాష్, దవేశ్, గ్యనసాయి, విష్ణువర్ధన్, సుమంత్, కౌశిక్, విజయ్ విజయం సాధించారు. వీరి విజయంపై కోచ్ బి.చంద్రవతి హర్షం వ్యక్తం చేశారు. అలాగే మంచి స్కేటింగ్ రింగ్ ఉంటే ఇంకా మంచి ఫలితాలు వస్తాయని అన్నారు.

వేడుకగా సామూహిక అక్షరాభ్యాసాలు

పోలాకి : సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఇచ్ఛాపురం : అక్షరాభ్యాసం చేస్తున్న చైర్మన్ కృష్ణమూర్తి రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వసంత పంచమి పురష్కరించుకుని నగరంలోని పిఎన్ కాలనీలో గల వరసిద్ది వినాయక ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలను సోమవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బంటుపల్లి కృష్ణశర్మ, చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యాన ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీవేద స్కూల్‌లో కూనపులి విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి విగ్రహానికి పూజలు, చిన్నారులచే ఓనమాలు దిద్దించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బోడ బాబూరావు, కరస్పాండెంట్ బోడ సునీత, ప్రిన్సిపాల్ నల్లా రామకృష్ణ, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు. అలాగే తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బల్ల కంఠయ్య ఆధ్వర్యంలో సరస్వతి దేవి విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి ప్రార్ధనలు చేశారు.

పోలాకి: నరసన్నపేట పట్టణంలో విజ్ఞాన భారతి పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి మండలాల టిడిపి అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, ఎం.వెంకట అప్పలనాయుడు, జి.చిట్టిబాబు, ఎస్.కృష్ణబాబు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని సహలాలపుట్టుగ ఒడియా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. 2022-23 పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆర్థిక సహాయంతో ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసన్న లిమ్మాయి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రుక్కు ప్రధాన్, ప్రమోద్ కుమార్ పాఢీ, రుక్కు ప్రధాన్, గౌరీ ప్రధాన్, బందావన్ దొళాయి, శ్రీనివాస్ బెహెరా, త్రిలోచన పొల్లాయి, జి.హేమలత, జి అన్నపూర్ణ, సుదర్శన దాస్, మోహన్ ప్రధాన్, మున్నా ప్రధాన్, స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ జానకి ప్రధాన్ పాల్గొన్నారు. అలాగే కవిటి కళ్యాణి ఆంగ్ల, బివికె, జాడుపూడిలో ఆర్‌ఎస్, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, ఎస్‌విజె విద్యా సంస్థల్లో సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు.

మెళియాపుట్టి : మండలంలోని నడసంద్రలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఎంఇఒలు దేవేంద్రరరావు, పద్మనాభంలు ఆశిష్కరించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చౌదరి, ఉపాధ్యాయులు అంజనాదాస్, సంధ్యారాణి, రామలక్ష్మి, ధర్మారావు, సామల్, నాగేశ్వరావు, జీవరత్నం పాల్గొన్నారు.

మందస : మండలంలోని బాలిగాం ఎంపిపిఎస్ పాఠశాలలో ఎంఇఒ మత్రిపాటు లక్ష్మణరావు అధ్యక్షతన అక్షరాభ్యాసం నిర్వహించారు. అలాగే పూర్వ విద్యార్థులు గున్న సాయి, భావన, సతీస్, శ్రీకాంత్‌లు విద్యార్థులకు ఉపయోగపడే ప్రింటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆరంగి భాస్కరరావు, బి.మాలయ్య, ఎస్‌ఎంసి చైర్మన్ వి.స్వాతి, వైస్ చైర్మన్ పాపారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కర్లమ్మ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, సర్పంచ్‌లు పచ్చ అప్పారావు, అదపాక శంకరరావు, పడాల వెంకటకృష్ణ, రౌతు ఆనంతరావు, చల్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక అమ్మఒడిలో నిర్వహించిన అక్షరాభ్యాసంలో కరస్పాడెంట్ బరాటం శ్రీనివాసరావు, ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నౌపడా సింహాచలం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఆధ్వర్యాన సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూకపాల్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని యర్నాగులపేట కూడలి వద్ద ఉన్న అదిత్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల అవరణలో కరస్పాండెట్ చింటు రాజారావు, ప్రిన్సిపాల్ శిమ్మ అప్పన్న అధ్యక్షతన ఉచితంగా 300 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు వారణాసి రామారావు, మెండ రామినాయుడు, రాళ్లపాటి నర్సింగరావు, పాపారావు, సనపల కరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ రైల్వే స్టేషన్ రోడ్డులో రామాలయం కాంప్లెక్స్‌లో నిర్వహించిన అక్షరభ్యాసం కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : అక్షరాభ్యాసం చేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం అర్బన్ : అక్షరాభ్యాస కార్యక్రమం

ఇచ్ఛాపురం : శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, రోజా, పద్మజ, శాంతి, జయలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 82 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కైలాసరావు, శ్రీనివాస్, సాయిప్రతాప్, పేరాడ సోమేశ్వరరావు, రవివర్మ పాల్గొన్నారు.